# ఇద్దరు పిల్లలు

ఆ దేవాలయానికి ధర్మకర్త లెవరో తెలియదు. మొండి గోడలమీద నాగుజెముడు కంప ధర్మకర్తృత్వం. పాడుబడ్డ బావి చుట్టూ జిల్లేడుపొదల ధర్మకర్తృత్వం. ఎటుతిరిగీ, సగం విరిగిన ధ్వజస్తంభం చుట్టూ వున్న కాస్త ఖాళీస్థలమే వూరిపిల్లలకు మిగిలింది.

అప్పటికప్పుడే పమిడివాళ్లబ్బాయి - బుచ్చి వచ్చి ఛేర్‌పట్టీలు గీచి, ఉప్పుదుచ్చే ఆటకు సన్నాహాలను పూర్తిజేస్తున్నాడు గాని వెనక వచ్చిన అలివేలు కొడుకు తక్కిన పిల్లలందర్నీ కలుపుకొని - "ఉప్పాట వద్దురా, బుచ్చీ! ఆ లెంకాలెంక ఆడుకుందాం రా" అన్నాడు. "ఆ లెంకా లెంక" లోనే బుచ్చిలంకె వున్నది. సత్తరగాయగా వుండి చెడుగుడులో పిల్లలవీపు చెటపట మనిపించగల బుచ్చి, "నిల్చుంటే తన్నులాట" లో హనుమంతు మోకాలు విరగదన్ని న బుచ్చి, చెరువులో ఆ గట్టునుండి యీ గనుముదాకా మూడుసార్లు ఏక దమ్ములో యీదిన బుచ్చి - ఆ లెంకంటేనే జడుస్తాడు. గీటుదాటి పోకుండా తనతోటి వాళ్ళు పట్టుకొన్నప్పుడు తనకు చక్కిలిగిలి.

"వద్దులేరా, మంగా! యివ్వాల్టికి వుప్పాట"

మంగన్న మోచేయిజాడించి, రెండవచేత్తో చూపుతూ "గెలవలేని కుక్క, గయ్యాళికుక్క" అని పదం పాడాడు. తక్కినవాళ్లంతా వంతందుకొని గేలిచేసి పెద్ద కేకలు వేయసాగారు. బుచ్చికి తండ్రిలేడు. అందుకని యీ వెధవల కంతా అంత అలుసు. తన సమవుజ్జీ మంగన్న గూడా యివ్వాళ గుంపుతో కలిశాడు.

మూతిబిగించి, జుట్టుపైకి విదిలించుకొని, తొడలుగొట్టి కోపపు కళ్ళతో బుచ్చి, గ్యాంగు ముందు నుంచొని - "అయితే రండిరా, సవ్వాల్! నన్ను ఔటు చెయ్యాలిరా యెదవల్లారా! కొబ్బరికాయ పందెం -" అని ఎదిరించాడు.

బుచ్చికి చక్కిలిగిలిపెట్టి మంగన్నే ఔటుచేశాడు. పిల్లలందరూ - 'కొబ్బరికాయ, కొబ్బరికాయ" అని అరిచారు.

"అన్యాయం జేశారు. చక్కలిగిలి పెట్టకుండా రండిరా చూద్దాం"

"అహఁ!! ఆహఁ!!అన్యాయంలేదు, గిన్నాయంలేదు. కొబ్బరికాయకావాల్సిందే."

బుచ్చి, గుంపువంక ఎదురుతిరిగి చూశాడు. తన్ను అవుటుచేసిన మంగన్న గాదు

